

# నెత్తిమీద గట్టిగా మూడు మొట్లు

ఒకూర్లో ఒకడు ఒంటెల్ని అద్దెకు యిచ్చి బతుకుతూ కాస్త డబ్బు దస్కంతో బాగానే వుండేవాడు. ఒకసారి తుపాను వచ్చింది. ఆస్తులు పోయాయి. ఒంటెలన్నీ చనిపోయాయి. ఒకటి మిగిలింది. యింక అక్కడ వుండటానికి ముఖం చెల్లక ఆ ఒక్క ఒంటెతో యింకో ప్రాంతానికి పోయి బతుకుదామని బయలుదేరాడు.

దారిలో ఒక సాహెబ్ (దైవ ఆరాధకుడు) కనిపించి 'ఆగు నాయనా. ఆగు' అని ఆపాడు ఒంటెలవాణ్ణి.

'నీ ముఖాన ధనము, సంపదా అంతా రాసిపెట్టుంటే ఎక్కడికి వెళుతున్నావు?' అని అడిగాడు.

'సాహెబ్. నేను బతికి చెడ్డ వాణ్ణి. యింకా నా ముఖాన ధనము, సంపదా ఎక్కడివి?' అన్నాడు ఒంటెలవాడు.

'కాదు. నీకు తెలియదు నాతో రా' అని చెప్పి, ఆ సాహెబ్ ఆ ఒంటెలవాణ్ణి ఒక కొండ మీది గుహకు తీసుకెళ్లాడు.

'చూడు. యిక్కడ పెద్ద నిధి వుంది. నీకు దారి చూపిస్తాను. వెళ్లి తీసుకురా. చెరి సగం పంచుకుందాం' అన్నాడు సాహెబ్.

సరేనని గుహలోకి వెళ్ళాడు ఒంటెలవాడు. చూస్తే ఏముంది వజ్రాలు, వైఢూర్యాలు, మణులు, మాణిక్యాలు, కళ్లు చాలనంత బంగారం.

మూట కట్టుకోగలిగినంత మూటగట్టుకొని, ఒంటె మీద వేసుకొని బయటికి వచ్చాడు ఒంటెలవాడు. ఇద్దరూ కలిసి ఇక కొండ దిగుతున్నారు.

సగం దూరం వచ్చాక ఒంటెల వాడి మనసు మారింది.

'సాహెబ్. ఈ నిధిలో సగం మీకెందుకు? మీకు యిల్లా వాకిలా పెళ్లాం బిడ్డలా? పావు చాలదా?' అని అడిగాడు.

'అలాగేలే' అన్నాడు సాహెబ్.

యింకాస్త దూరం వచ్చాక మళ్లా మనసు మారింది ఒంటెలవాడికి.

'సాహెబ్. మీరు అల్లా వలీ అంటూ తిరిగే దేవుని మనుషులు. మీకు డబ్బు దస్కం మీద ఏమి మమకారం వుంటుంది. పావు ఎందుకు? మూడు దోసిళ్లు చాలవా?' అన్నాడు.

'మువ్వు అంతగా చెబితే అలాగేలే' అన్నాడు సాహెబ్.

కొండ పూర్తిగా కిందకు దిగాక యింకా మనసు మారిపోయింది ఒంటెలవాడికి.

'సాహెబ్. మీకు మూడు దోసిళ్లు కూడా ఎందుకు? మీరు ఈ లోకంలో ఖాళీ చేతుల్తో వచ్చారు. ఖాళీ చేతుల్తో పోతే సరిపోదా?' అన్నాడు.

సాహెబ్‌కి ఆ ఒంటెలవాడి మీద జాలి కలిగింది.

'నాయనా. నీకు డబ్బాశ చాలా ఉన్నట్టుంది. అలాగైతే నీకు ఈ చిన్నాచితకా నిధులు చాలవు. యింకో ఉపాయం చెప్తాను. ముందు ఈ నిధిని ఎక్కడి నుంచి తెచ్చావో అక్కడ పెట్టిరా' అని చెప్పాడు.

ఒంటెలవాడు హుషారుగా వెళ్లి నిధిని వాపసు పోసి వచ్చాడు.

అప్పుడు సాహెబ్ వింత ద్రవమున్న ఒక చిన్న సీసాను సృష్టించి 'ఈ ద్రవాన్ని కుడి కంట్లో పూసుకో. నీకు నేలలో ఎక్కడెక్కడ నిధులున్నాయో కనబడతాయి. వాటిని తవ్వి తీసుకుని హాయిగా బతుకు. అయితే ఒక్క విషయం. దీనిని పొరపాటున కూడా ఎడమ కంట్లో పూసుకోబాక. రెండు కళ్లూ పోతాయి' అని చెప్పి, వెళ్లిపోయాడు.

ఒంటెలవాడు ద్రవాన్ని తీసి కుడి కంట్లో పూసుకున్నాడు. వెంటనే వాడికి భూమిలో ఎక్కడెక్కడ నిధులున్నాయో, ఎక్కడెక్కడ లంకె బిందెలున్నాయో కళ్లకు అవుపించడం మొదలయ్యింది.

'అరె. ఒక్క కంట్లో పూసుకుంటేనే యిన్ని నిధులు కనిపిస్తున్నాయే రెండో కంట్లో కూడా పూసుకుంటే యింకెన్ని నిధులు కనిపిస్తాయో కదా' అని చెప్పి రెండో కంట్లో కూడా పూసుకున్నాడు. అంతే. దెబ్బకు రెండు కళ్లూ పోయాయి.

ఉన్న ఒక్క ఒంటె పోయి, కొండలో నుంచి తెచ్చిన నిధీ పోయి, భూమిలో దాగిన నిధులన్నీ పోయి, ఆఖరికి రెండు కళ్లూ పోయి బిచ్చగాడయ్యాడు ఒంటెలవాడు.

అప్పట్నించి వాడు సముద్రం వొడ్డున అడుక్కుంటూ తిరిగేవాడు.

అయితే అట్లా అడుక్కుని తినడంలో వాడిదొక పద్ధతి వుండేది. ఎవడైనా ఏదైనా దానం చేస్తే తీసుకునేవాడు కాదు. తన చేతిలోని కర్రని యిచ్చి 'ఈ కర్రతో నా నెత్తి మీద గట్టిగా మూడు మొట్టండి. అప్పుడు మీ దానం తీసుకుంటాను' అని అనేవాడు. మూడు మొట్టేదాకా వదిలేవాడు కాదు.

జీవితంలో మళ్లీ ఆశబోతుతనానికి వెళ్లకుండా యిలా మూడు మొట్టించుకుంటూ అదే శిక్షగా బతికాడు ఆ ఒంటెలవాడు.